వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 29 జూలై 2024

## జిల్లాలో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి



**రాయచోటి, జులై 28, ప్రభాతవార్త:**
రాబోయే ఆరు మాసాలలో రాయచోటి నియోజకవర్గంలో పూర్తి నీటి సమస్య పరిష్కరించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాగు, సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రాయచోటి నియోజకవర్గంలో రాబోయే ఆరు మాసాలలో పూర్తి నీటి సమస్య పరిష్కరించేందుకు ఒక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. గతంలో నియోజకవర్గ ప్రజలు నీటి సమస్యతో నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. దీంతో రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లి, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో ప్రజలకు ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. సమస్య ఉన్న ప్రాంతాలను గురించి సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించడం జరిగిందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రజలు, ప్రతి ఒక్కరూ సహకరించాలని రాయచోటిని నీటి సమస్య రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**రాయచోటి, జులై 28, ప్రభాతవార్త:**
ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 29న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. అక్కడ పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

# రాజంపేట తెలుగుదేశంలో 'ఇన్‌చార్జ్' రగడ

- అధికారంలోకి వచ్చినా తీరు మారదా?
- నేతల మధ్య రచ్చకెక్కిన విభేదాలు
- అధిష్టానం జోక్యం చేసుకోకపోతే అథ:పాతాళమే!!
- తలపట్టుకొంటున్న అధికారులు



**పరాజయం పాలైన పద్ధతి మార్చుకోవడం లేదు. అధికారంలోకి వచ్చిన తీరు మారడం లేదు. ఆధిపత్యం కోసం పార్టీని భ్రష్టు పట్టిస్తు న్నారు. అధికారులకు చులకన అవుతున్నారు. వర్గ రాజకీయాలు పరా కాష్టకు చేరాయి. నియోజకవర్గస్థాయి నేతల్లోనే కాదు ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య కూడ విభేదాలు రచ్చకెక్కాయి. రాజంపేట నియో జకవర్గం విశయంలో అధిష్టానం జోక్యం చేసుకోకపోతే పార్టీ పరిస్థితి అథ: పాతాళానికి చేరడం ఖాయం అని పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది....**

**రాజంపేట అర్బన్, జూలై 28, ప్రభాతవార్త:**
వర్గ రాజకీయాలకు రాజంపేట నియోజకవర్గం పెట్టింది పేరు. లిటిగెంట్ రాజకీయాలకు కేరాఫ్ రాజంపేట. వెన్నుపోటు రాజకీయాలకు ప్రధాన కేంద్రం. పార్టీలో ఉంటూనే ప్రత్యర్థులతో చేతులు కలిపే కుటిల నేతలు. పార్టీ నేతలం అంటూనే ప్రత్యర్థి పార్టీ అభ్యర్థుల నుంచి కరెన్సీ కట్టలు దండుకునే ద్రోహులు. పగలు ఒక రాజకీయం చీకటి పడితే స్వార్థ రాజకీయం. అందుకే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి సునామిలా అధికారం వచ్చినా రాజంపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటమి చవిచూసింది. ఎన్నికలు అయిపోయాయి అధికారం వచ్చింది. ప్రజలకేం చేయాలి పార్టీని నియోజకవర్గంలో ఎలా పటిష్టం చేయాలి, కలిసి పనిచేయాలి ఇవన్నీ నేతలు మరిచారు. ఫలితంగానే రాజంపేటలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ఇకపోతే చివరి నిమిషంలో టికెట్ దక్కించుకున్న టిడిపి అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పోలింగ్‌కు వారం రోజుల ముందే ఆర్థికపరమైన అంశాలలో చేతులు ఎత్తేశారు. నేతలను సమన్వయం చేసుకోవడంలో విఫలం అయ్యారు. నోటిఫికేషన్‌కు కొన్ని నెలల ముందే ఉమ్మడి కడప జిల్లాలో గెలిచే సీట్లలో ముందు వరుసలో ఉన్న రాజంపేట నియోజకవర్గంలో క్లైమాక్స్‌లో దారుణమైన పరిస్థితులు కీలకసర్వేలో బయటపడటంతో స్వయంగా పార్టీ అధినేత చంద్రబాబే షాక్ అయ్యారు. జిల్లా పర్యటనకు వచ్చి సుగవాసితో మాట్లాడేందుకు ప్రయత్నించి ఆశించిన స్పందన లేకపోవడంతో ఖంగు తిన్నారు. చివరకు అర్ధరాత్రి పార్టీ ప్రతినిధులను ఆయన వద్దకు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీ అంతర్గత సమీక్షల్లో బాలసుబ్రమణ్యంకు టికెట్ ఇచ్చి పొరపాటు చేశామని వ్యాఖ్యానించే వరకు పరిస్థితులు దారి తీశాయి. కారణాలు ఏమైతేనేం ఎన్నికల్లో బాలసుబ్రమణ్యం పరాజయం పాలయ్యారు. ఓటమికి ఎన్నో కారణాలు ఉన్న ఆయన అందరిని కలుపుకు పోవడంలో విఫలం అయ్యారనేది జగమెరిగిన సత్యం. ఇక టికెట్ కోసం ప్రయత్నించి స్వయంకృతాపరాధంతో చేజార్చుకున్న ఓ నాయకుడు వైసీపీతో ఉన్నతస్థాయిలో మిలాఖత్ అయి నియోజకవర్గంలో పార్టీకి తీరని నష్టం చేసినా వ్యవహారం పార్టీ నిఘా బృందం కూడ పసిగట్టి పార్టీ అధినేతకు నివేదిక ఇచ్చింది. నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నుండి సొమ్ము అందుకున్న పార్టీ నేతల చిట్టా కూడ అధినేతతో పాటు నారా లోకేష్ వద్దకు చేరింది. రాజంపేట నియోజకవర్గంలో పార్టీలో ఉంటూనే ఏ స్థాయిలో బరితెగించి పార్టీకి ద్రోహం చేశారో తమకు తెలుసునని అధినేతను కలిసిన వారికి చురక అంటించారు కూడ. ఈ విషయం అటుంచితే ఎన్నికల తర్వాత అదిష్టాణం నియోజకవర్గ ఇంచార్జ్‌గా అధికారికంగా ఎవరిని ప్రకటించలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులే ఇంచార్జ్‌గా చెప్పుకోవడం మామూలుగా జరిగేదే. అధిష్టానం కూడ దాదాపు ఓడిపోయిన అభ్యర్థినే ఇంచార్జ్‌గా ప్రకటించడం జరుగుతూ ఉంటుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే ఈ విధంగా ఇంచార్జ్‌ని ఇతరులను నియమిస్తారు. కాదంటే రాజంపేట నియోజకవర్గంలో టికెట్ కోసం చివరి వరకు జగన్‌రాజు, చెంగల్‌రాయుడు పోటీ పడ్డారు. పార్టీ అవసరాల దృష్ట్యా అధిష్టానం ముందు చెంగల్‌రాయుడుకు టికెట్ లేదని చెప్పి రైల్వేకోడూరు నియోజకవర్గంలో కొన్ని బాధ్యతలు అప్పగించింది. పార్టీ జిల్లా అధ్యక్షునిగా ఉన్న జగన్‌రాజుకు టికెట్ ఖాయం అని ఆ తరుణంలో ప్రచారం జరిగింది. అయితే చివరి నిమిషంలో రాజంపేట పార్లమెంట్ స్థానం పొత్తులో భాగంగా బీజేపికి కేటాయించడం జరిగింది. అప్పటికే రాజంపేట ఎంపీ అభ్యర్థిగా బాలసుబ్రమణ్యం పేరు ప్రచారంలో ఉండటం జరిగింది. ఈ పరిస్థితుల్లో రాయలసీమలోనే బలిజ సామాజికవర్గానికి ఎక్కడా టికెట్ కేటాయించలేని పరిస్థితుల్లో బాలసుబ్రమణ్యంను పక్కన పెట్టలేక రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా అనూహ్యంగా ఎంపికచేశారు. ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. అనంతరం పార్టీ అధినేతను కలిశారు. తన ఓటమికి కారణాలను వివరించారు. పార్టీ అధినేత కూడ అన్ని పరిస్థితులు అప్పటికే ఆయనకు తెలియడంతో బాల సుబ్రమణ్యంను కూడ గట్టిగా హెచ్చరించారు. మరోవైపు జగన్ రాజుకు కూడ పార్టీ అధినేత చంద్రబాబుతో పాటు లోకేష్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును కలిశారు. నియోజకవర్గంలో పార్టీ ఓటమి పాలు కావడానికి జగన్ రాజుకు కూడ అధిష్టాణం కొంతవరకు ఝలక్ ఇచ్చింది. కొంత కాలం తర్వాత మరళా జగన్ రాజు సీఎం, లోకేష్‌లను కలిసి ఇంచార్జ్‌గా నియమించాలని కోరినట్లు సమాచారం. అప్పటికే నియోజకవర్గ ఇంచార్జ్ తానే అని బాలసుబ్రమణ్యం ప్రకటించుకున్నారు. అధిష్టానం ప్రత్యేకంగా ఇంచార్జ్ అని ప్రకటించ దని చెప్పడం ప్రారంభించారు. అధికారులకు కూడ ఇంచార్జ్ తానే అని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లోనే తాజాగా అధికారుల బదిలీల వ్యవహారం పార్టీలో విభేదాలను రచ్చకెక్కేలా చేసింది. అధికారులు కొన్ని విశయాల్లో ఇంచార్జ్‌గా ప్రకటించుకున్న బాలసుబ్రమణ్యంను కలిసి కొన్ని నిర్ణయాలు తీసుకోవడం ప్రారంభించారు. నియోజకవర్గంలో వర్గ రాజకీయాలు బలంగా ఉన్న నేపథ్యంలో బాల సుబ్రమణ్యం అధికారులకు ఇచ్చే ఆదేశాలు పార్టీ పరంగా ఒక వర్గానికి క్షేత్రస్థాయిలో ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా పార్టీ కోసం పనిచేసిన నేతలకు తెలియకుండా కొన్ని నిర్ణయాలు అధికారులకు చెప్పడం వారు పాటించడంతో సిద్ధవటం మండలంలో రెండు రోజుల క్రితం బహిరంగంగా పార్టీ నాయకులు సోషల్ మీడియాలో బాల సుబ్రమణ్యం తీరుపై మండిపడ్డారు. ఇదే పరిస్థితి అటు ఒంటిమిట్ట, రాజంపేట, వీరబల్లె మండలాల్లో కూడ కనిపిస్తోంది. ఫలితంగా అదికార పార్టీలో నియోజకవర్గ ఇంచార్జ్ వ్యవహారం కొన్ని ముఖ్య శాఖల అధికారులకు తలనొప్పిగా మారింది. జిల్లా స్థాయి అధికారులను కలిసిన సంధర్భంలో కూడ ఇంచార్జ్‌గా ఎవరిని ప్రకటించలేదనే అంశాన్ని చెప్పే వరకు దారి తీసింది. దీంతో అదికార పార్టీ అంతర్గత వ్యవహారం తమకు సమస్యగా మారిందని అధికారులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. రాజంపేట ఆర్డీఓగా ఉన్న మోహన్ రావును కొనసాగించే విశయంలో ఓ నేత లేఖ ఇచ్చిన ప్రభుత్వం ఐఏఎస్‌ను నియమించింది. త్వరలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, తహసీల్దార్‌ల బదిలీల నేపథ్యంలో ఇంచార్జ్ వ్యవహారం కీలకంగా మారింది. అధిష్టాణం ఇంచార్జ్ విశయంలో స్పష్టమైన సంకేతాలు ఇవ్వకపోతే నేతల మధ్య రచ్చకెక్కిన విభేదాలు పార్టీ పరువును బజారున పడే ప్రమాదం ఉంది.

ఎన్నికల ముందు వర్గ రాజకీయాలు ఉన్న అధికారంలోకి వచ్చిన తర్వాత కూడ అదే పరిస్థితి కొనసాగుతుండటం పార్టీకి విధేయులుగా పనిచేసే వారిని క్షోభకు గురిచేస్తుంది. నేతలు నేటికి పార్టీ కార్యక్రమాల్లో వేరు వేరుగా పాల్గొంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పార్టీ శ్రేణుల్లో కూడ అధిష్టానం నాన్పుడు ధోరణి సరికాదని వ్యక్తం అవుతుంది. ఈ నేపథ్యంలో అధిష్టాణం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే..

## ఆరోగ్యమే మహాభాగ్యం
## ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- ప్రతి ఒక్కరూ ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



**జమ్మలమడుగు, జులై 28, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిలు సంయుక్తంగా పేర్కొన్నారు. ఆదివారం జమ్మలమడుగులోని రిపబ్లిక్ క్లబ్ నందు దేవగుడి శంకర్‌రెడ్డి మరియు సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో, వైదేహి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో 116 విప్ ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిలు సంయుక్తంగా హాజరై రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యం అన్నింటికి మూలమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. దేవగుడి శంకర్‌రెడ్డి మరియు సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో వైదేహి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ వారి సమకారంతో 116 విప్ ఉచిత వైద్య శిబిరాన్ని జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణరెడ్డి ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఇది ఒక మంచి కార్యక్రమమని జమ్మలమడుగు పరిసర ప్రాంద ప్రజలందరూ ఈ ఉచిత శిబిరాన్ని వినియోగించుకొని ఆరోగ్యాన్ని బాగుపరుచుకోవాలన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గ విషయాలను క్లుప్తంగా వివరించడం జరిగదన్నారు. ప్రజలకు ఏమి అవసరమని అడగగా ముఖ్యంగా తాగునీరు ఆరోగ్యం రహదారుల సదుపాయం కల్పించాలని చెప్పారన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రజలకు ఇబ్బంది కలగకుండా భోజన సదుపాయం కల్పించారన్నారు. ఇక్కడ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించిన నిపుణ డాక్టర్లు ఉన్నారని క్యాన్సర్ గుండె జబ్బులు, కీళ్ల మరియు ఆర్థోపెటిక్ డాక్టర్లు ఉన్నారని కిడ్నీకి సంబంధించిన డాక్టర్లు కూడా ఉన్నారని చెప్పారు. ఇక్కడికి వచ్చిన వారికి సంబంధించి ఒక డెటా బేస్‌ను తయారు చేయాలని ఏవి ఉన్నత స్థాయి ఆసుపత్రి బెంగళూరుకు పంపించాలనే విషయం అలాగే ఏవీ ఇక్కడే చికిత్సలు చేసేందుకు ఉన్నాయని వివరాలను ఇవ్వాలని వాటి ప్రకారం చికిత్సలను కడప మరియు ప్రొద్దుటూరులో చేయడం జరుగుతుందని చెప్పారు. వారికి పూర్తి స్థాయిలో న్యాయం చేసినట్లుగా మనం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అన్నికంటే ఆరోగ్యం ఎంతో గొప్పదని ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని చెప్పారు. ఇక్కడ దేవగుడి శంకర్‌రెడ్డి మరియు సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో వైదేహి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రిసెర్చ్ సెంటర్ సహకారంతో 116 విప్ ఉచిత వైద్యశిబిరం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఏర్పాటు చేయడం ఎంతో సంతోసించగదగ్గ విషయమన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఎటువంటి వివక్ష లేకుండా ప్రజలకు పోలీసు సేవలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ శాంతి, వైదేహి ఆసుపత్రి సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు జూదరులు అరెస్ట్

**కడప క్రైం, జులై 28, ప్రభాతవార్త:**
కడప నగరంలోని టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గౌస్‌నగర్‌లో పసుపు మండీ వద్ద ఆదివారం సాయంత్రం నలుగురు జూదరులను సీఐ ఇబ్రహీం ఆధ్వర్యంలో ఎస్సై సంజీవరాయుడు తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. రూ.20,150, పేక ముక్కలను సీజ్ చేశారు.

## హెపటైటిస్ పై ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ



**రాజంపేట అర్బన్, జూలై 28, ప్రభాతవార్త:**
రాజంపేట ఏరియా హాస్పిటల్స్‌లో ఆదివారం డిప్యూటి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాని శేఖర్ ఆధ్వర్యంలో నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం గురించి ప్రజలకు అవగాహణ కల్పించాలని సిబ్బందికి వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. రాజంపేట డివిజన్‌లో ఉన్న అన్ని ప్రాథమిక కేంద్రాలలో వైరల్ హెపటైటిస్ బి, సి పరీక్షలు ఉచితంగా చేయబడతాయన్నారు. హెపటైటిస్ బి, సి పాజిటివ్ వచ్చిన వారికి మందులు ఉచితంగా ఇస్తామన్నారు. పాజిటివ్ హెపటైటిస్ బి మరియు సి వచ్చిన వారు తప్పని సరిగా కుటుంబసభ్యులకు హెపటైటిస్ బి, సి పరీక్షలు చేయించాలని సూచించారు. గర్భవతులందరికి ఉచితంగా పరీక్షలు, వ్యాధి సోకినవారికి తగిన విధంగా ట్రీట్‌మెంట్ ఇవ్వబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, శివరాం, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

# వెలగని వీధి దీపాలు

**దువ్వూరు, జూలై 28, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులో ప్రధాన రహదారి అలాగే పలు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తెలుగు గంగా బంగ్లా, స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద, స్టేట్ బ్యాంక్, సబ్ రిజిష్టర్ ఆఫీస్ వీధి అలాగే మరికొన్ని వీధుల్లో కూడ వీధి దీపాలు వెలగడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది వెలిగే విద్యుత్ దీపాలు కూడ 24గంటలు పగలు, రాత్రి తేడాలేకుండా వెలుగుతూనే ఉంటాయి. వాటిని గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. అలాగే కొన్ని చోట్ల వీధి దీపాలు ఉన్న చెడిపోయి వెలగడం లేదు. వీటిని గ్రామ పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏ వీధులలో విద్యుత్ దీపాలు వెలగడం లేదో గమనించి కొత్త విద్యుత్ దీపాలు వేయాలని దువ్వూరు ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి

**రాజంపేట, జులై28, ప్రభాతవవార్త :**



ఓబులవారిపల్లె మండలం కొర్లకుంట రెవెన్యూ గ్రామం చల్లంపల్లె కు వెళ్లే దారిలో విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందాడు ఈ సంఘటనలో మంగంపేట ఎస్‌టీ కాలనీకి చెందిన వెలుగు రాజేంద్ర (35) మృతి చెందాడు. ఓబుల వారి పల్లె ఎస్ఐ చిన్న పెద్దయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ఆదివారం తెల్లవారుజామున కొర్లకుంట చెరువులో చేపలు పట్టుకునేందుకు వెళ్లడం జరిగిందన్నారు. చెరువుకు సమీపంలో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు అడవి జంతువులను వేటాడేందుకు అక్రమ విధ్యుత్ లైన్‌ను వేశారన్నారు. మృతుడు దానికి గమనించకుండా వెళ్లడంతో విద్యుత్ తీగలు తగిలి అక్కడి కక్కడే మృతి చెందాడు. జంతువుల వేట కోసం అక్రమ విధ్యుత్ లైన్ ను తీసిన వారు వాటి కోసం ఉదయాన్నే వచ్చి చూడడంతో అడవి జంతువులకు బదులుగా వ్యక్తి మృతదేహం కనబడింది. ఎలాంటి సమాచారం లేకుండా మృతదేహాన్ని హతమార్చేందుకు పక్కనే ఉన్న మంగంపేట డంపింగ్ యార్డ్ రాళ్లక్రింద పాతి పెట్టారు. ఇంతలో వారి బంధువులు మృతుని కోసం ఫోన్ చేస్తే కొన్ని సార్లు రింగై కొన్ని సార్లు స్విచ్ ఆఫ్ రావడంతో వెతుక్కుంటూ వచ్చి రాళ్లక్రింద ఉన్న మృతదేహాన్ని చూసి పోలలీసులకు సమాచారాన్ని అందించారన్నారు. దీంతో హుటాహుటిన రాజంపేట డియస్‌పి చైతన్య, కోడూరు సిఐ సురేంద్ర రెడ్డి ఓబులవారిపల్లె ఎస్ఐ చిన్న పెద్దయ్యలు సంఘటనా స్థలానికి చేరుకొని సుమారు 6,7 గంటల పాటు ఆచూకీ కోసం ఆరా తీశారు. చివరకు అనుమానితులు అంతు పట్టకపోవడంతో ఆదివారం రాత్రి 9 గంటలకు పోలీస్ జాగిలాల ద్వారా ఆరా తీశారు. దీంతో కొంతవరకు ఆచూకీ లబించిందని అసలు నిందితులు ఎవరన్నది తొందరలో ఆరా తీస్తామని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు కూడా తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## జాతరలో ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు

**కలికిరి, జులై 28, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని శ్రీ ఎల్లమ్మ దేవత అమ్మవారి జాతర సందర్భంగా కలికిరి పంచాయతీ ఉప సర్పంచ్ ఎల్లప్ప ఆధ్వర్యంలో కలికిరి ఎంపీడీవో కార్యాలయం ఈవోఆర్డీ పరశురాం, ఈవో గురుమోహన్‌లు ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. జాతర ప్రాంతంలో ఎక్కడా మురుగు నీరు, చెత్త లేకుండా శుభ్రం చేయించారు. అదే విధంగా ప్రతినిత్యం ఈవో అమ్మవారి ఆలయ ప్రాంతంలో పర్యటిస్తూ సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కలికిరి పంచాయతీ ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో ఆలయ పరిసర ప్రదేశం అంతా పరిశుభ్రంగా ఉండడంతో కలికిరి పంచాయతీ ప్రజా ప్రతినిధులను మండల స్థాయి అధికారులను పంచాయతీవో ఈవో గురుమోహన్ సైతం పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పంచాయతీ కార్యదర్శులు విజయేంద్ర, రిషికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## నగరకూడళ్లు, శివార్లలో స్పెషల్ డ్రైవ్

**కడప క్రైం, జులై 28, ప్రభాతవార్త:**
జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు నగరంలో కడప ఇన్‌ఛార్జి డీఎస్పీ సుధాకర్ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్, స్పెషల్ పార్టీ సిబ్బంది ప్రతి రోజు రాత్రి, తెల్లవారుజామున స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. నగరంలోని అన్ని కూడళ్లు, శివార్లలో రాత్రి పూట అనుమానాస్పదంగ తిరుగుతున్న వారిన బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని, ఆకతాయిలు ఇతర చిన్న చిన్న నేరాలకు పాల్పడే వారిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. వయోజనులు, మహిళలు, వాకింగ్ చేసే ప్రాంతాల్లో మార్కెట్, బస్టాండ్, రైల్వేస్టేషన్ల వద్ద వాహనాల్లో గస్తీ తిరుగుతూ అనుమానాస్పదంగా ఉన్న వారిని విచారిస్తున్నారు. కడప జిల్లాను నేర రహిత జిల్లాగా చేయాలన్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఐపీఎస్ ఆదేశాలతో పలు చర్యలకు శ్రీకారం చుట్టారు.



## స్కూటరు-కారు ఢీ - ఒకరికి గాయాలు

**వీరపునాయునిపల్లె, జులై 28, ప్రభాతవార్త :**



మండలంలోని వీరపునాయునిపల్లెలో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. స్పీడుబ్రేకరు వద్ద నిదానంగా వెళ్తున్న స్కూటరును అతివేగంగా వెనుకవైపు నుండి వచ్చిన కారు ఢీకొట్టడంతో స్కూటర్‌లో ప్రయాణిస్తున్న దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. ముద్దనూరు మండలం ఉమ్మారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఈ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108ద్వారా ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఇందులో స్కూటరులో ప్రయాణిస్తున్న మహేశ్వర్‌రెడ్డికి రక్తగాయాలయ్యాయి. ఆయన సతీమణి తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

## చల్లంగా చూడమ్మా గంగమ్మ



రైల్వేకోడూరు, జులై 28, ప్రభాతవార్త:

చల్లంగా చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డిలు అన్నారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవ రాజుపురం గ్రామస్తులు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గంగమ్మ జాతర కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ చల్లంగా చూడమ్మా అని రైల్వేకోడూరు నియోజకవర్గం ప్రజలను చూడాలని గంగమ్మకు మొక్కులు చెల్లించినట్లు వారు తెలియజేశారు. ముఖ్యంగా తన గెలుపుకు సహకరించిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేస్తున్నామని,అదే కోవలో రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధి కూడా అలాగానే చేపడతామని అన్నారు. గత ప్రభుత్వంల చేసిన తప్పులను ప్రస్తుత ప్రభుత్వం చేయమని చెప్పిందే చేస్తామని ప్రజలకు భరోసా ఇస్తున్నామని అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో పేద బడుగు బాలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తామని వారు అన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఓబుల్ రెడ్డి, విక్టరీ నరసింహారెడ్డి, విక్టరీ రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, గురు బ్రహ్మ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సాలవ రమణ రాజు, రజీనికాంత్ రెడ్డి, పొలసాని కిరణ్ కుమార్, వెంకటేష్ యాదవ్, అరవ నాని తదితరులు పాల్గొన్నారు.

## డిల్లీలో జరుగు మహాదర్నాను జయప్రదం చేయండి

మైదుకూరు జులై 28, ప్రభాతవార్త :



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగష్టు 9వతేదిన డిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగు ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మాల సంఘం చైర్మెన్ గోళ్ల అరుణ్ కుమార్ పిలుపు నిచ్చారు. మైదుకూరు కడప రోడ్డులోని అంభేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి మ్యానుఫేస్టొను విడుదల చేశారు. ఈ సంధర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆగస్టు 9వతేది శుక్రవారం డిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగు మహాదర్నాకు రెండు తెలుగు రాష్టాలనుండి భారీగా మాలలు తరలిచ్చి ధర్నాను విజయవంతం చేయవలసినదిగా కోరారు.ఎస్సీ వర్గీకరణ చట్టవిరుద్దమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి జోక్యం చేసుకొకుడదని,ఎస్సీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు 15శాతం నుండి 30శాతానికి పెంచాలని, 2021 జనాభ లెక్కల ప్రకారం ఎస్సీ ఉపకులాల వారిగా సర్వే నిర్వహించి ప్రవేట్ సేక్టారులలో రిజర్వేషన్లు అమలు చేయాలని,కేజీ టూ పీజి విద్యను దేశ వ్యాప్తంగా అమలు పరచాలని, జివో నెంబరు 371ను తక్షణమే రద్దు చేయాలని అలాగే పోలీసు డిపార్టుమెంటుకు సంబంధించిన జివో నెంబరు 46ను రద్దుచేయాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగాల కోసం ఎంట్రేన్స్ ఎగ్జామ్ రాసినపుడు ఓఫేన్ కేటగిరిలో వచ్చిన వారికి ఓపేన్ కేటగిరిలో ఇవ్వాలి,ప్రభుత్వం తెచ్చిన జీవొ ఎం.ఎస్ నెంబరు 2ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలొ తిట్ల చిట్టి బాబు, మాల మహనాడు జిల్లా యూత్ ప్రసిడెంటు నల్లా వెంకటసుబ్బయ్య, భూమిరెడ్డి చిన్న మాధవయ్య, జిల్లా ఉపాద్యక్షులు తంగిళ్ల లాజర్, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, శాస్త్రీ, లక్ష్మయ్య, సుజాత తదితరులు పాల్గోన్నారు.

### బేధాభిప్రాయాలు వీడి

## టిడిపి అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలి

### ఓడిన అభ్యర్థులే నియోజకవర్గ ఇన్చార్జులు



సిద్దవటం, జూలై 28, ప్రభాతవార్త:

మండల పరిధిలోని భాకరాపేట గ్రామంలో కాడే చెంచయ్య నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం టిడిపి పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాగమునిరెడ్డి మాట్లాడుతూ టిడిపి పార్టీ అధిష్టానం మేరకు ప్రతి ఒక్క కార్యకర్త నడుచుకోవాలని టిడిపి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అలా కాకుండా పార్టీకి నష్టం చేకూర్చు విధంగా చూయకూడదన్నారు. నాయకుల మధ్య ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. మల్లు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ చాలా కాలం నుండి ఓడిపోయిన అభ్యర్థులే నియోజకవర్గ ఇన్చార్జిలుగా కొనసాగడం ఆనవాయితీ వస్తుందని ఆ విధంగానే రాజంపేట నియోజకవర్గంలో సుగవాసి బాల సుబ్రమణ్యం టిడిపి పార్టీ ఇన్చార్జిగా కొనసాగుతారని ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. రాజా నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలలో టిడిపి పార్టీ ప్రభంజనం సృష్టిస్తే రాజంపేటలో ఓటమిని చవి చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఓటమిపై అధిష్టాణానికి ఇప్పటికే స్పష్టత ఉందన్నారు. రాజశేఖర్ యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలందరూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలే తప్ప టిడిపి పార్టీ నష్టం వైపు కాదన్నారు. పార్టీ అభ్యర్థి ఓడి పోవడంతో రాజంపేట టిడిపి నాయకులపై అధిష్టాణం దృష్టిలో ఉన్న నమ్మకాన్ని కోల్పోయిందని ఇప్పటికైన పార్టీ క్రమశిక్షణతో నాయకులందరూ ముందుకెళ్లాలన్నారు. కాడే చెంచయ్యనాయుడు మాట్లాడుతూ టిడిపి పార్టీలో నాయకులందరూ భేదాభిప్రాయాలు వీడి పార్టీ అభివృద్ధికి ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలే తప్ప వేరే పార్టీకి చోటు ఇవ్వకూడదన్నారు. పార్టీలో బేధాభిప్రాయాలు ఏర్పడితే పార్టీకే నష్టం కలుగుతుందన్నారు. ఎన్నికలలో ఓటమి చెందిన అభ్యర్థి రాజంపేట టిడిపి పార్టీ ఇన్చార్జిగా సుగవాసి బాలసుబ్రమణ్యం కొనసాగుతారని ఇందులో ఎటువంటి అపోహాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలేయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

వేంపల్లె, జులై 28, ప్రభాతవార్త :

కాలేయవ్యాధిపై తాళ్లపల్లె పీహెచ్‌సీ ఆద్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం కాలేయవ్యాధి దినోత్సవం సందర్భంగా స్థానిక హరిజనవాడలో ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటరు షఫివున్నీసా మాట్లాడుతూ మానవ శరీరంలో కాలేయ అవయవం పెద్దదన్నారు. కణజాలం, కండరాలు పనిచేసేందుకు శక్తిని అందించే గ్లూకోజ్ మోతాదు నియంత్రణకు కాలేయం పాత్ర కీలకం అన్నారు. కాలేయం దెబ్బతింటే శరీరమంతా కుప్పకూలుతుందని తెలిపారు. వ్యాధి రాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటలక్ష్మి, ఏఎన్ఎం లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.



## దొంగతనం కేసులో ముద్దాయిలు అరెస్టు

వేంపల్లె, జులై 28, ప్రభాతవార్త :



వేంపల్లె పట్టణంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో ముద్దాయిలను అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని బండల ఉత్తన్న వీధిలో నివాసం ఉంటున్న సయ్యద్ నూర్జహాన్ ఇంటిలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంటి బీగం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి వస్తువులు దొంగలించినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈనెల 19న నూర్జహాన్ కడపలోని తన కుమార్తె వద్దకు వెళ్లి తిరిగి ఈనెల 26న వేంపల్లెకు వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు బీరువాను పగలగొట్టి ఆభరణాలు దొంగలించినట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3.00గంటల ప్రాంతంలో పాపఘ్ని నదిలో బ్రిడ్జి దగ్గర ఇద్దరు ముద్దాయిలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ చాంద్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ మధుసూధన్‌వర్మ, కానిస్టేబుళ్లు మహేష్, కిరణ్‌లను డీఎస్పీ అభినందించారు.

## పాపఘ్ననదిని నాశనం చేసింది వైఎస్ఆర్‌సీపీ నేతలే

వేంపల్లె, జులై 28, ప్రభాతవార్త :



గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనలో పాపఘ్ని నదిని నాశనం చేసింది వైఎస్ఆర్‌సీపీ నేతలేనని, టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు మహమ్మద్ షబ్బీర్‌లు అన్నారు. ఆదివారం వేంపల్లెలో వారు విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ నేతలు అక్రమం గా పాపఘ్ని నదిలో ఇసుక టిప్పర్లు, లా రీలతో రవాణా చేస్తున్నారని సాక్షి పత్రికలో కథనాలు రాయడం మంచిది కాదన్నారు. సాక్షి పత్రిక ఇసుకపై తప్పుడు కథనాలు రాస్తున్నదన్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఇలాంటి తప్పుడు కథనాలు సాక్షి దినపత్రిక రాస్తే న్యాయ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. పాపఘ్ని నది దగ్గరగా ఉన్నప్పటికీ గత వైఎస్ ఆర్‌సీపీ పాలనలో టిప్పర్ ఇసుక రూ.10వేలుకు విక్రయించి సొమ్ము చేసుకోవడం జరిగిందని చెప్పారు. చంద్రబాబుపై, బీటెక్ రవిపై ఇసుక బురద చల్లేందుకు కథనాలు రాస్తున్నారన్నారు. ఉచిత ఇసుకలో ఎలాంటి అవినీతికి పాల్పడ వద్దని మా నాయకుడు చంద్రబాబు, బీటెక్ రవీంద్రనా థ్‌రెడ్డిలు ఇచ్చిన ఆదేశాల మేరకు ఇసుక తవ్వకాలను టీడీపీ నాయకులు చేయలేదన్నారు. టీడీపీ పార్టీకి ప్రజల్లో వ్యతిరేకత ఇచ్చే విధంగా వైఎస్ఆర్‌సీపీ పత్రిక రాతలు రాస్తున్నట్లు చెప్పారు. టీడీపీకి చెడ్డపేరు తెచ్చే విధంగా వేంపల్లె టీడీపీ నాయకులు చేయరన్నారు. విలేకర్ల సమావేశంలో సీనియర్ నాయకులు దేశం సుబ్బారెడ్డి, పి.వి.రమణ, భాస్కర్, యూనిట్ సభ్యులు జబీబుల్లా, వేమకుమార్, వీరభద్ర, డక్కా రమేష్, శ్రీనివాసులు, మహమ్మద్, పాములూరు బాషా, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ అమలు ఎప్పుడు?

వేంపల్లె, జులై 28, ప్రభాతవార్త :

టీడీపీ కూటమి మేనిఫెస్టోలోని అన్నదాత సుఖీభవ పథకం అమలు ఎప్పుడు అని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ ఎన్.తులసిరెడ్డి సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. ఆదివారం ఆయన వేంపల్లెలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీడీపీ కూటమి సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టిందని, అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.20వేలు ఆర్థికసాయం చేస్తామన్నారు. రైతులు నమ్మి ఓట్లు వేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చేందుకు అన్నదాత సుఖీభవ పథకం ప్రధాన కారణమని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 45రోజులు గడుస్తున్నప్పటికీ అతీగతీ లేదన్నారు. ప్రస్తుత ఖరీఫ్ ప్రారంభమై సగం సీజన్ అయిపోయిందని, ఏరువాక పున్నమి కూడా ముగిసిందన్నారు. ఆయా ప్రాంతాల్లో వానలు, వరదల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులు, కౌలు రైతులకు వెంటనే అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. గత వైకాపా ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ జీవో 22ను రద్దు చేఆయలని తులసిరెడ్డి అన్నారు. ఈ జీవోను వెంటనే రద్దు చేసి శ్రీకాకుళం జిల్లాల్లో వ్యవసాయ మోటర్లకు బిగించిన మీటర్లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గడువు ముగిసిందా?



ఒకటి కొంటే మరొకటి ఫ్రీ అనో, ముందే కొనిపెట్టేసుకుంటే నయం అని బ్యూటీ ఉత్పత్తులు స్టాక్ పెట్టుకుంటూ ఉంటాం కదా! కొన్ని సార్లు ఎక్కడో పెట్టి మర్చిపోతాం. తీరా చూసుకునే సరికి ఎక్స్‌పైరీ అవుతుంటాయి. ఇలాంటి అనుభవం మీకు అయిందా? అంతంత డబ్బు పోసి కొంటాం. పడేయాలంటే మనసు బాధపడుతుంది కదూ! పోనీ ఇలా వాడేద్దాం.

- స్కిన్ కేర్ రొటీన్ మొదలయ్యేదే క్లెన్సర్‌తో కదా! అదే గడువు తీరితే వాడాలంటే భయమేస్తుంది కదూ! అదే గడువు తీరితే వాడాలంటే భయమేస్తుంది కదూ! దాన్ని ఇతర వస్తువుల శుభ్రతకి వాడొచ్చని తెలుసా? మేకప్ బ్రష్‌లు, ట్యాప్‌లను దీంతో క్లీన్ చేస్తే సరి. జిడ్డు వదలడమే కాదు, తెలిగ్గా శుభ్రమవుతాయి.
- మాయిశ్చరైజర్‌ని అయితే పాదాలు, మోకాళ్లు మోచేతులకు వాడొచ్చు. ముఖంతో పోలిస్తే అక్కడి చర్మం కాస్త మందంగా ఉంటుంది. కాబట్టి, తట్టుకుంటుంది. అయినా రిస్క్ తీసుకోలేమంటారా? అయితే హ్యాండు బ్యాగుల శుభ్రతకు వాడేయండి. మెత్తని వస్త్రంపై కొద్దిమొత్తంలో మాయిశ్చరైజర్ తీసుకొని, దాంతోపైన తుడిస్తే సరి. మెరుపు కోల్పోవు. అయితే లెదర్ బ్యాగులు.. ముదురు రంగులవి శుభ్రం చేసేప్పుడు జాగ్రత్త. కాస్త రంగు మారే అవకాశముంది.
- టోనర్లు సాధారణంగా కాస్త పెద్ద బాటిల్‌లోనే వస్తుంటాయి. ఆన్‌లైన్ షాపింగులోనేమో తేదీ చెక్ చేసుకునే వీలుండదు. పొరపాటున వచ్చాకా చెక్ చేసుకోలేదో.. అది పూర్తయ్యేలోపు గడువు ముగిసే దాఖలాలెన్నో. అదికాకపోయినా కొన్నిసార్లు చర్మతీరుకు సరిపడకపోవచ్చు. దాంతో పక్కన పెట్టేస్తాం. అదీ వృథానేగా! వాటితో అద్దం ఫర్నీచర్, షూ, చెక్క వస్తువులు తుడిచి చూడండి. మెరవడం ఖాయం.
- ఫ్లేవర్ నచ్చిందని ఒకటి, ఎప్పుడూ అందుబాటులో ఉండాలని బ్యాగులోకొకటి..ఇలా ఎక్కువ కొనేవాటిల్లోలిప్‌బామ్ ఒకటి. ఇది సరిపడకపోయినా, ఎక్స్‌ఫైరీ అయినా బాధపడనక్కర్లేదు. గోళ్ల పక్కన చర్మం తరచూ పొడిబారడం, కాళ్ల పగుళ్ల లాంటి సమస్యలున్నాయా? వాటికి వాడిస్తే సరి. సమస్యా తీరుతుంది. డబ్బు వృథా అయిదన్న బాధా ఉండదు. □

## అతని విజయంలో ఆమె..



క్రికెట్ చూసేటప్పుడు కొంతమందికి కొన్ని సెంటిమెంట్లు ఉంటాయి. ఈ కుర్చీలో కూర్చొని చూస్తే ఇండియా గెలుస్తుం దని.. నడిస్తే ప్రత్యర్థి జట్టు వికెట్ పడుతుందని.. ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో నమ్మకం ఉంటుంది. అలాగే తానూ ఓ సెంటిమెంట్‌ను నమ్ముతానంటోంది హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ సతీమణి రితికా సజ్దే. గ్యాలరీలో కూర్చొని తన భర్తను అనుక్షణం ఛీర్ చేసే ఆమె. ప్రతి మ్యాచ్‌లోనూ ఫింగర్స్ క్రాస్డ్ (చూపుడు వేలు, మధ్య వేలిని క్రిస్క్రాస్‌గా పెట్టడం)' పొజిషన్ పెడతానంటూ ఇటీవలే ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది. 'మ్యాచ్ ఆద్యంతం క్రాస్డ్ ఫింగర్స్‌తోనే కూర్చుంటుందని, ఇదే తనకు కలిసొస్తుంద'ని రోహిత్ కూడా తన భార్యను ఆకాశానికెత్తేశాడు. ఇలా ఈ ఒక్క విషయంలోనే కాదు.. అర్ధాంగిగా రోహిత్ జీవితంలో సగ భాగమైన రితిక.. తన పర్సనల్ మేనేజర్‌గా కెరీర్‌లోనూ సగ భాగమైంది.

**యువీ కలిపాడు!......** రోహిత్‌శర్మ.. మైదానంలో హిట్‌మ్యాన్‌గానే మనకు తెలుసు! సైలెంట్‌గా సిక్సులు, ఫోర్లు బాదే కూల్ కెప్టెన్‌గానే మనం ఇతడిని చూశాం కానీ తెర వెనుక తన భర్త ఓ రొమాంటిక్ ప్రేమికుడు అంటోంది రితిక. పెళ్లికి ముందు నుంచే ఓ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ సంస్థను నడుపుతోన్న ఆమె.. యువరాజ్ సింగ్, విరాట్ కోహ్లీ.. వంటి క్రికెటర్లకు మేనేజర్‌గానూ వ్యవహరించింది. ఇలా యువీకి మేనేజర్‌గా వ్యవహరిస్తోన్న సమయంలోనే రోహిత్‌ను కలుసుకున్నట్లు ఓ సందర్భంలో పంచుకుంది మిసెస్ రోహిత్. యువికి మేనేజర్‌గా వ్యవహరించే సమయంలో ఇద్దరం కలిసి పలు మీటింగ్‌లకు హాజరయ్యే వాళ్లం. తను నన్ను ఓసోదరిలా భావించేవాడు. అలా ఓ ఈవెంట్లో పాల్గొన్న మాకు రోహిత్ కలిశాడు. అప్పుడే నేను, రోహిత్ ఒకరినొకరం చూసుకున్నాం. ఆపై తనకు మేనేజర్‌గా మారాను. క్రమంగా మా మధ్య అనుబంధం బలపడింది. ఒకరి మనసులో ఒకరం ఉన్నామని తెలుసుకున్నాక.. ఒకరినొకరం విడిచి ఉండలేకపోయాం. ముంబయిలోని ఓ స్పోర్ట్స్ క్లబ్‌లో రోహిత్ నాకు రోమాంటిక్‌గా ప్రపోజ్ చేసిన ఆ క్షణం నేను మర్చిపోలేను. ఇక మా ప్రేమకు పెద్దల ఆశీర్వాదం కూడా తోడవడంతో 2015లో మా పెళ్లి జరిగింది. అంటూ తన క్యూట్ ప్రేమకథను పంచుకుంది రితిక. ఈ అందాల జంటకు ప్రస్తుతం సమైరా అనే ఐదేళ్ల పాప ఉంది.

**భార్యగా.. మేనేజర్‌గా...** క్రికెట్ అంటే ఎప్పుడూ ఏదో ఒక మ్యాచ్ ఉండనే ఉంటుంది. మ్యాచ్‌ల కోసం దేశవిదేశాలకూ తిరగాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు ఇంటిని మిస్సవుతుంటారు చాలామంది క్రికెటర్లు. కానీ తాము ఇందుకు మినహాయింపు అంటున్నారు రోహిత్-రితిక. ఎందుకంటే భార్యగా రోహిత్ జీవితంలో సగ భాగమైన ఆమె.. అతడికి పర్సనల్ స్పోర్ట్స్ మేనేజర్‌గా వ్యవహరిస్తూ కెరీర్‌లోనూ అర్ధాంగిగా మారింది. ఈ క్రమంలోనే రోహిత్‌కు సంబంధించిన క్రికెట్ వ్యవహారాలు, ప్రకటనలు, ఇతర విషయాలన్నీ రితికే దగ్గరుండి చూసుకుంటోంది. అందుకే తమ మధ్య ఉండే ప్రేమే కాదు. కెరీర్ కూడా తమ అనుబంధాన్ని మరింత దృఢం చేస్తుందంటున్నారీ లవ్లీ కపుల్.

**తనే నా లక్కీ ఛార్మ్...** ఇక ఎక్కడ మ్యాచ్ జరిగినా తన భర్తతో కలిసి అక్కడ వాలిపోతూ.. గ్యాలరీలో కూర్చొని తన భర్తను ఛీర్ చేస్తుంటుంది మిసెస్ రోహిత్. అంతేకాదు.. తన భర్త ప్రతి మ్యాచ్‌లోనూ రాణించాలని, జట్టు గెలవాలనికోరుకుంటూ.. ఓ సెంటిమెంట్‌ను కూడా ఫాలో అయిపోతుందట రితిక. ఇటీవలే 'కపిల్ శర్మ షో'లో పాల్గొన్న రోహిత్ తన భార్య సెంటిమెంట్ గురించి మరోసారి చెప్పుకొచ్చాడు. సిక్సులు కొడుతూ తమ గర్ల్‌ఫ్రెండ్స్‌ని ఇంప్రెస్ చేయొద్దని ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు అప్పుడప్పుడూ అడుగుతుంటారు. అవును.. ఇలాంటి సరదా విషయాలు కూడా అప్పుడప్పుడూ మా డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చకొస్తాయి. ఆ సమయంలో వాళ్లతో నేను ఒక్కటే చెప్పా. నేను కొట్టే ప్రతి షాట్ వెనుక నా భార్య రితిక ప్రోత్సాహం, స్ఫూర్తి ఉన్నాయి. నేను రాణించాలని, భారత్ గెలవాలనే తాను



ఎప్పుడూ కోరుకుంటుంది. అందుకే మ్యాచ్ ఆద్యంతం ఫింగర్స్ క్రాస్ పెట్టి కూర్చుంటుంది. తనే నా అదృష్ట దేవత. అంటూ తన భార్యను ఆకాశానికెత్తేశాడీ హిట్‌మ్యాన్. ఇటీవలే టి 20 ప్రపంచకప్ గెలిచిన సమయంలోనూ తన భర్తను ఛీర్ చేసిన ఈ క్రికెట్ లవర్.. ఆ మ్యాచ్‌లోనూ రితిక చేతివేళ్లు క్రిస్ క్రాస్‌గా పెట్టి కూర్చుందని, అందువల్లే టీమిండియా విజయం సాధించిందంటూ ఫ్యాన్స్ అంతా ఆమెకు ధన్యావాదాలు చెబుతున్నారు.

**రో.. నిన్ను చూసి గర్వపడుతున్నా...** ప్రతి మగాడి విజయం వెనుక ఒక మహిళ ఉన్నట్లే.. మన హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోన్న ఆయన ఇష్టసఖి రితిక తన భర్త కెప్టెన్సీలో టి20 ప్రపంచకప్ రావడంతో ఉప్పొంగిపోతోంది. ఆ క్షణం భావోద్వేగంతో నిండిపోయిన రోహిత్ ఫొటోల్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఆమె. గర్వంగా ఉందంటూ మురిసిపోయింది. 'రో... ఈ కప్ నీకు ఎంత విలువైందో నాకు తెలుసు! ఈ ఫార్మాట్, కప్, జట్టు, వీటన్నింటి కోసం నువ్వెంత పరితపించావో నేను చూశాను. ముఖ్యంగా గత కొన్ని నెలలుగా నువ్వు పడ్డ శ్రమకు ప్రతిఫలమిది! ఆఖరికి నువ్వు కన్న కల ఇలా సాక్షాత్కారమవుతుంటే అది చూసి నా మనసు ఉప్పొంగింది నీ జర్నీ స్ఫూర్తిదాయకం! నువ్వు సాధించిన విజయాలు చూసి ఓ భార్యగా గర్వపడుతున్నా. అదే సమయంలో టి 20 ఫార్మాట్ నుంచి రిటైడ్ అవడం అంతే బాధగా ఉంది. అవ్యూ సో మచ్ డియర్! అంటూ ఎమోషనల్ అయింది రితిక. ప్రపంచకప్ మ్యాచ్ ముగిశాక స్టేడియంలో తన భార్య రితిక, కూతురు సమైరాతో కలిసి సరదాగా గడిపాడు రోహిత్. ఆ ఫొటోలు, వీడియోలు కూడా ఈ జంట అన్యోన్య దాంపత్యానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచాయని చెప్పచ్చు. □

## పిసిఓఎస్ తగ్గాలంటే..

పొట్ట కండరాలు బలపడటానికీ, వెన్నెముక, పిసిఓఎస్ సమస్యలు తగ్గటానికీ, సిస్టులు, ఫైబ్రాయిడ్స్ కరగడానికీ ఉష్ట్రాసనం బాగా పనిచేస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా రెండు కాళ్లను వెనకకు మడిచి కూర్చోవాలి. తరవాత నెమ్మదిగా మోకాళ్ల మీద లేచి కుడిచేత్తో కుడికాలి మడమని, ఎడమేత్తో ఎడమ కాలిమడమని వెనక్కి వాలుతూ ఫొటోలో చూపిన విధంగా పట్టుకోవచ్చు. మొదటిసారి ప్రయత్నించేవారు పాదాన్ని అందుకోలేక పోతే పాదాన్ని వేళ్లమీద ఆనించి మడమని పట్టుకోవాలి. ఈ ఆసనాన్ని పదిసెకన్లు చొప్పున రోజుకి మూడుసార్లు చేయాలి. నెమ్మదిగా శ్వాస తీసుకుంటే యథాస్థితికి వచ్చి మోకాళ్లపై కూర్చోవాలి. ఈ ఆసనం చేశాక దీని అనుబంధ ఆసనం కూడా చేస్తే మరింత ఫలితం చేకూరుతుంది.



శశాంకాసనం

**శశాంకాసనం ...** ఉష్ట్రాసనం వేసిన తరవాత ఈ శశాంకాసనం చేస్తే శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. అందుకే దీన్ని శాంతినిచ్చే ఆసనం అని కూడా అంటారు. ఈ ఆసనం వేయడం వల్ల ఛాతీ, పొట్ట, వెన్నెమక కండరాలకి నూతన శక్తి లభించి హాయిగా ఉంటుంది. మంచి నిద్రపడుతుంది. కోపం అదుపులో ఉంటుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా వజ్రాసనంలో కూర్చోవాలి. నెమ్మదిగా రెండు చేతులనూ పైకి పెట్టి శ్వాస వదులుతూ మెల్లగా వంగి, చేతులను ముందుకు ఫొటోలో చూపిన విధంగా ఉంచాలి. ఈ క్రమంలో నుదుటిభాగం నేలను తాకేలా ఆనించాలి. మొదటిసారి ప్రయత్నించేవారు దిండుసాయంతో చేస్తే ఎటువంటి ఇబ్బంద ఉండదు. □



ఉష్ట్రాసనం

## అకాడమిక్ క్యాలెండర్ ప్రకటించాలి

కడప వైద్యవిభాగం, జులై 28, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్ కోరారు. ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ మీడియం పరీక్షలు రాసేవారని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఇంగ్లీష్‌మీడియాన్ని ప్రవేశపెట్టి ఇంగ్లీష్ మీడియంలోనే పరీక్ష రాయాలని చెప్పిందన్నారు. దీనిపై టీడీపీ కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఇంకా తగ్గలేదని, ఉపాధ్యాయుల కొరత ఉందని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు విద్యాశాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ ప్రభుత్వ పాఠశాలను కాపాడేందుకు విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్,పాలెం మహేష్‌బాబు, సహాధ్యక్షులు రవికుమార్, కౌన్సిల్ వమెంబర్ రాము పాల్గొన్నారు.

## మంచినీటి నివారణకు ప్రత్యేక చర్యలు



గాలివీడు, జులై 28(ప్రభాతవార్త):
రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పడిన మంచినీటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని ఎస్‌ఏ ఫంక్షన్ హాల్‌లో మైనార్టీ నాయకుడు పూలికుంట డీలర్ టోపీవలి మనమల్లు పుట్టినరోజు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య ఏర్పడిన గ్రామాల్లో జడ్పీ నిధులతో బోర్లు వేయించి ఆ సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. అలాగే వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, పూలికుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ లక్ష్మయ్య, మాజీ సర్పంచులు పొట్టి జగన్నాథరెడ్డి, మహమ్మద్‌రియాజ్, మహమ్మద్‌రఫీ, గీదర ఈశ్వరరెడ్డి, మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ మహబూబ్‌బాషా, టీడీపీ నాయకులు మిట్టపల్లి వెంకటరమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూల బండ్ల ఆక్రమణలను తొలిగించండి మహాప్రభో

రైల్వేకోడూరు,జులై 28,ప్రభాతవార్త:



రైల్వేకోడూరు పట్టణంలోని స్థానిక టోల్ గేట్ సమీపంలో గాంధీ బొమ్మ వద్ద ఆనుకుని ఉన్న పూల అంగళ్లు పూర్తిస్థాయిలో వాహనాలకు ప్రయాణికులకు పాదాచారులకు అందరికీ ఆటంకంగా ఏర్పడిందని వాటిని పూర్తి స్లాయిలో తొలగిస్తే రవాణా సౌకర్యానికి సౌలభ్యంగా ఉంటుందని పట్టణ ప్రజలు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఉన్న విద్యుత్ బిల్లులు చెల్లించే కార్యాలయం సబ్ ట్రెజరీ కార్యాలయాలు కూడా కనపడకుండా పూర్తిస్తాయిలో ఆక్రమణ చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వీరు ఎటువంటి బాడుగులు లేకుండా లక్షలాది రూపాయల వ్యాపారాలు చేస్తూ ధౌర్జన్యంగా కూడా దిగుతున్నారని చాలామంది విమర్శిస్తూ, విలేకరులు ఇటువంటి వాటిపై వార్తలు రాయచ్చు కదా అని బహిరంగా విమర్శిస్తున్నారు. పట్టణంలో దాదాపు 40 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో వ్యాపారం చేసేకుంటూ లక్షలాది రూపాయలు కూడ పెట్టి ప్రయానికులకు పాదాచారులకు ఆటంకాలను కలిగిస్తున్న విషయం గదులను లేదా వారికి బంకుల రూపాంలో ఏర్పాటు చేస్తే ఎవరికి ఎటువంటి ఆటంకం ఉండదని అంటున్నారు. ఆగస్టు 15న మరియు పట్టణంలో ర్యాలీలు నిరసన కార్యక్రమాలు చేపడితే పూర్తిస్తాయిలో అన్ని వర్గాల వారికి ఆటంకంగా ఈ పూల బంకులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉన్నతాధికారులు వీరిపై ప్రత్యేక చొరవ చూపి ఆటంకంగా ఉన్నతాధికారులు ఉన్న పూల ఆంగళ్లను ప్రక్కకు తీసివేసే విధంగా కృషి చేయాలని పంచాయతీ అధికారులకు పట్టణ ప్రజలు సూచిస్తున్నారు.

## క్రికెట్ టోర్నమెంటు విజేత ఆవులపల్లె టీమ్



రామసముద్రం, జులై 28 ప్రభాతవార్త :
మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయితీ కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న చెంబకూరు మేగా క్రికెట్ టోర్నమెంటులో విజేతగా ఆవులపల్లె టీమ్ గెలవడం జరిగింది. రన్నర్‌గా నిమ్మనపల్లె వాల్మీకిబాయ్స్ నిలిచారు. ఇందులో గెలుపొందిన మొదటి బహుమతిని రవీంద్రనాథ్ చేతుల మీదుగా అందించారు. రెండవ విజేతకు సీనియర్ క్రికెట్ సభ్యులు అశోక్‌స్వామి చేతుల మీదుగా అందజేశారు. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ సతీష్ గెలుచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకులు విశ్వనాథ్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, విజయ్, అశోక్‌స్వామి, దండువారిపల్లె, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు క్రిష్ణమూర్తి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంకర వేశారు...కీలు మరిచారు...

బి.కొత్తకోట, జులై 28 ప్రభాతవార్త :
రోడ్లు సొగసులు చూడాలంటే ఇక్కడే చూడాలి...రోడ్లు బాగా పడ్డాయంటే బి.కొత్తకోటలోనే గమనించాలి... అధికారులకు, కాంట్రాక్టర్లకు సమన్వయ లోపంతో రోడ్లు ఉన్నఫలంగా వదిలేయడం జరిగింది. దీంతో సంబంధింత ప్రజలు, వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకట మండలం నక్కరాజుపల్లె నుంచి దీనిమిదపల్లెకు వెళ్ళే రోడ్డు మరమ్మత్తు పనులు ఆలస్యం కారణంగా ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఈ రోడ్డుమార్గాన వెళ్ళాంటే కంట కన్నీరు వస్తోందని ఆవేదన చెందుతూ కాంట్రాక్టర్లను నానా భూతులు తిట్టుకొంటున్నారు. నక్కరాజుపల్లె నుంచి దిన్నేమీపల్లె వరకు దాదాపు రెండుకిలో మీటర్ల మేర రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభమై ఏదాది కావస్తోంది. ఇప్పటి వరకు రోడ్డు పనులు పూర్తి కాలేదు. పాత బిటి రోడ్డును తవ్వేసి అధికారులు రెండున్నర గజాల మేర రోడ్డు ఎత్తును పెంచి కంకర అదరా..బదరా వేసేశారు. ఈ రోడ్డున ప్రయాణించాలంటే దుమ్ముదూళి వస్తోందని నెలల కొద్ది కంకరరోడ్డుపై వెళ్ళాలాంటే భయమేస్తోందన్నారు. అర్ అండ్‌బి అధికారులు స్పందంచి రోడ్డులో వేసిన కంకరపై కాస్త కనుకరించి కీలు రోడ్డు వేయాలని పలువురు కోరుతున్నారు.



## పాఠశాలలకు వెళ్లాలంటే - ప్రమాదాలను దాటాల్సిందే..

రాజంపేట, జులై 28, ప్రభాతవవార్త :



ఆడుతూ పాడుతూ అల్లారు ముద్దుగా చదువుల కోసం వెళ్లే చిన్నారుల పరిస్థితి అన్నమయ్య జిల్లాలో అధిక శాతం పాఠశాలల్లో అగమ్యగోచరంగా ఉన్నాయి. పాఠశాలలకు వెళ్లాలంటే పిల్లలు అనునిత్యం ప్రమాదాలను దాటిల్సిందే. బడి ముందు ఉండే ప్రమాద గండాలతో క్షణ క్షణం భయం భయంగా బడులకు వెళ్లి చదువుకునే పరిస్థితులు విద్యార్థులకు దాపురించడంతో ఆశ్యర్యకరంగా ఉంది. వీటి పట్ల చర్యలు తతీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యపు నీడలకు అద్దం పుడుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాద సూచికలు తెల్పిందుకు సూచిక బోర్డులు పెట్టడంలో కూడా అధికారులు తీవ్ర స్థాయిలో విఫలమైనట్లు తెలుస్తోంది. అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లోని పాఠశాలల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలు, సుమూరు 2209 ఉన్నాయి. వీటితో పాటు 548 ప్రైవేటు పాఠశాలలఉ కూడా ఉన్నాయి అయితే వీటిలో అధిక శాతం పాఠశాలలు రహదారికి ప్రక్కనే ఉన్నాయి. ఈ పాఠశాలలకు చదువు కోసం వెళ్లే పిల్లలు ప్రతి నిత్యం చావులు తప్పించుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. ఈ రహదారులపై క్షణం తీరిక లేకుండా ఆర్టీసి బస్సులే కాకుండా అనేక రకాల వాహనాలు అత్యంత వేగంతో దూసుకు వెళుతుంటాయి. పెద్దలే రోడ్డు దాటాలంటే 10 నిమిషాల పాటు ఆగి అటూ ఇటు చూసి దాటుకునే పరిస్థితి పాఠశాలలకు వెళ్లే పిల్లల పరిస్థితి చూస్తే అగమ్యగోచరంగా గానే కనపడుతుంది. బడికి వచ్చేందుకు గంట మ్రోగినా బడి వదిలేందుకు గంట మ్రోగినా ఎక్కడ ఉపాధ్యాయులు కొడతారనే భయంతో వెనుకూ ముందుకు చూడకుండా రోడ్డును దాటేస్తున్నారు. దీంతో అనేక ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగి అనేమ మంది పిల్లల ప్రాణాలు గాలిలలో కలసి పోయాయి. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు పిల్లలను రోడ్డు దాటించడంలో ఏదో ఒక రోజు ఆదమరచక తప్పడం లేదు. ఆ సమయాల్లో ప్రమాదాలు కూడా పొంచి ఉండి పిల్లల ప్రాణాలపై ప్రమాద గండాలు పురి విప్పుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సంబంధిత శాఖాధికారులు నిర్లక్ష్యాన్ని వీడి అతి వేగంగా వెళ్లే వాహనాలను వేగాన్ని నిరోదించే ప్రయత్నాలు చేయకపోతే అనునిత్యం పిల్లలు ప్రమాదాలకు గురికాక తప్పదని చెప్పవచ్చు ఈ విషయమై అన్నమయ్య జిల్లా డిఈఓను వివరణ కోరగా ఆర్టీఓతో కలసి వాహనాల వేగాన్ని పాఠశాలల సమీపంలో వేగ నిరోధక సూచిక బోర్డులను ఏర్పాటు చేయించి పాఠశాలల ముందు ఉన్న ప్రమాద గండాల నుంచి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆడికృత్రిక మహోత్సవాన్ని విజయవంతం చేయండి

మదనపల్లె, జులై 28 ప్రభాతవార్త :
మదనపల్లె రూరల్ మండలంలోని నిమ్మనపల్లె రోడ్డు వశిష్ట స్కూల్‌కు ఎదురుగా ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం దేవస్థానం ఆలయంలో సోమ, మంగళవారాలు రెండు రోజులు పాటు ఆడికృత్రిక మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని ధర్మకర్తలు రాచపల్లె అనూరాధ, సుబ్రమణ్యంలు కోరారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు దైవప్రేరణతో కావళ్ళ అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 10.30గంటలకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి పంబల వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి సుబ్రమణ్యం స్వామికి కావళ్ళు సమర్పిస్తారని తెలిపారు. మంగళవారం రోజున ఆడికృత్రికను పురష్కరించుకొని సుబ్రమణ్యంస్వామి ఆలయంలో అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానకార్యక్రమం జరుగుతుందన్నారు.

## కువైట్ శంకర్ మృతదేహానికి నివాళి

కురబలకోట, జులై 28 ప్రభాతవార్త :



తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మొలకలచెరువు మాజీ జడ్పిటిసిటి కువైట్ శంకర్ మృతి చెందారు. ములకలచెరువులోని తన నివాసంలో కువైట్‌శంకర్ మృతదేహాన్ని కోఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు, రాజంపేట పార్లమంటరీ బీసిసెల్ నాయకులు సురేంద్రయాదవ్‌లు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వీరితో పాటు మోహన్‌రెడ్డి, అయూబ్, బొగ్గు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మసీదు భూమికి కంచె ఏర్పాటు

కురబలకోట, జులై 28 ప్రభాతవార్త :



కబ్జాకు గురైన కురబలకోట కొత్త మసీదు భూమిని స్వాధీనంచేసుకొన్న కమిటీ సభ్యులు పెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ భూమి విలువైనది కావడంతో మరోసారి భూ కబ్జాకు గురికాకుండా పెన్సింగ్ ఏర్పాటు చేసుకొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ భూమి ప్రైవేటు కళాశాలకు సమీపంలో ముంబై-చెన్నై నాలుగు లైన్లరహదారికి పక్కలో ఉండడంతో కోట్లాదిరుపాయలు విలువ చేస్తుంది. ఈ భూమికి సంబంధించిన మసీదు పేరిట పట్టాదారుపాసుబక్కు మంజూరు చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తపరిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోకబ్జా కోరల నుంచి బయట పడడమే కాకుండా పట్టాదారుపాసుపుస్తకం కూడా మంజూరు కాగలదని కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తపరుస్తున్నారు.


## వైభవంగా కావిళ్ళ పండగ



రామసముద్రం, జులై 28 ప్రభాతవార్త :
మండలంల్లోనిఇ పెద్దకురప్పల్లె గ్రామ పంచాయితీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో కావిళ్ళ పండగను నిర్వహించారు. తిరుమలరెడ్డివారిపల్లె గ్రామస్థులు ఉపవాసదీక్షతో సుబ్రమణ్యంస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు వస్త్రాలు ధరించి కావిళ్ళను పూజించి కేరళ వాయిద్యాల నడుమ హారోంహర అంటూ స్వామిని దీక్షించి గ్రామం నుంచి తమిళనాడులోని తిరుత్తనికి బయలుదేరి వెళ్ళారు.

## వైకాపా హాయాంలోనే రెవెన్యూ వ్యవస్థ భ్రస్టుపట్టింది

మదనపల్లె, జులై 28 ప్రభాతవార్త :



వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలోనే రెవెన్యూ వ్యవస్థ బ్రస్టు పట్టిందని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ తెలిపారు. ఆదివారం ఆయన సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనను పరిశీలించేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రెవెన్యూ ఆడంగల్, జమాబందీని పూర్తిగా రద్దు చేశారన్నారు. రెవెన్యూ వ్యవస్థనే నాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. 200ఏళ్ళ నాడు రెవెన్యూ చట్టం తయారైందని ఆ చట్టాలను ఆయన తుంగలో తొక్కారన్నారు. గతంలో తహశీల్దార్, కరుణాల దగ్గర రెవెన్యూ లెక్కలు ఉండేవన్నారు. సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో ఎంతటి వారైనా తప్పుచేసి ఉంటే శిక్షించబడుతారన్నారు. అగ్ని ప్రమాద సంఘటనకు సంబంధించి సిఐడి, పోలీసులు చేపడుతున్న దర్యాప్తు అభినందనీయమన్నారు. ఇదే తరహాలోనే గతంలో విజయవాడలో జరిగిన పొల్యూషన్‌బోర్డు అగ్నిఘటనపై కూడా దర్యాప్తు చేపట్టి ప్రమాద ఘటనకు కారకులైన వారిని శిక్షించాలన్నారు. ఉమ్మడిరాష్ట్రం రెండు కుటుంబాల లబ్ధికోసమే విడిపోయిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చెక్కబెట్టాలని సూచించారు.

## సబ్‌కలెక్టరేట్ అగ్ని ఘటనపై కీలకనేతల ఇళ్ళల్లో సోదాలు

**మాజీ మంత్రి పిఏ ఇంటిలో డాక్యుమెంట్లు స్వాధీనం**

**తంబళ్లపల్లె ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఇళ్లల్లో తనిఖీలు**

**ముమ్మరంగా కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు**



మదనపల్లె, జులై 28 ప్రభాతవార్త :
సబ్‌కలెక్టరేట్ అగ్ని ఘటనపై కీలకనేతల ఇండ్లల్లో ఆదివారం సిఐడి పోలీసులు సోదాలు నిర్వహించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిఏగా వ్యవహరించిన శశికాంత్ హైదరాబాద్‌లోని తన నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించి కీలకమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకొన్నారు. అతను అందుబాటులో లేకపోవడంతో డాక్యుమెంట్లును స్వాధీనం చేసుకొన్నారు. అదే విధంగా తంబళ్ళపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి నివాసంలో కూడా సోదాలు చేశారు. ఎంపి మిథున్‌రెడ్డి అనుచరుడైన బాబాజాన్ ఇంటిలో కూడా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటివద్ద కూడా పోలీసులు సాయంత్రం తనిఖీలు నిర్వహించి విచారణ చేపట్టారు. సబ్‌కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి కీలకమైన నేతల ఇళ్ళల్లో సోదాలు నిర్వహించడం, విచారించడం పట్ల కేసు వేగవంతంగా దర్యాప్తు జరుగుతోంది. ఇప్పటికే పూర్వ ఆర్డీఓలు ఎంఎస్.మురళి, హరిప్రసాద్‌లతో పాటు సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా మున్సిపల్ వైస్‌చైర్మెన్ జింకా చలపతి, సర్పంచ్ భర్త అక్కులప్పలను కూడా రెండురోజుల క్రితం విచారించి వదిలిపెట్టిన విషయం తెలిసిందే. ప్రమాద ఘటనకు సంబంధించి రోజు రోజుకు దర్యాప్తు వేగవంతం కావడంతో పలువురిలో ఆందోళన నెలకొంటోంది. రెండు రోజుల్లో అగ్ని ప్రమాదానికి కారకులైన వారిని పోలీసులు అరెస్టు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారంగా తెలుస్తోంది. అంతేకాకుండా బాధ్యులుగా పేర్కొంటున్న ఉద్యోగులను సస్పెండ్ చేయనునన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డిల అనుచర వర్గాల్లో ఈ కేసుకు సంబంధించి ఆందోళన నెలకొంది. ఎవరిని ఎప్పుడు విచారణకు పిలిపిస్తారోనని భయాందోళన పడుతున్నారు. ఈ కేసుకు సంబంధించి మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ కూడా ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి అగ్నిప్రమాద ఘటనలో తప్పుచేసిన వారిని శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. పోలీసుల వేగవంతం చేస్తున్న దర్యాప్తు పట్ల అభినందించారు.

## రాష్ట్ర స్థాయి సమ్మేళానాన్ని విజయవంతం చేయండి

**రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, ప్రసాద్**

మదనపల్లె, జులై 28 ప్రభాతవార్త :
ఈనెల 29, 30, 31వ తేదీల్లో మదనపల్లెలో జరగనున్న రాష్ట్ర రైతుసంఘం రాష్ట్రస్థాయి సమ్మేళానాన్ని విజయవంతంచేయాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఈశ్వరయ్య, కెవి.ప్రసాద్‌లు కోరారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయుకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మొదటిరోజు వ్యవసాయ రంగం ప్రభుత్వాల భాద్యత అనే అంశంపై సెమినార్ జరుగుతుందన్నారు. ఈసెమినార్‌కు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ప్రధానకార్యదర్శి రావు వెంకటయ్య, వడ్డే శోభనాద్రిలు సిపిఐ జాయింట్ మాజీ డైరెక్టర్ జేడి లక్ష్మినారాయణలు హాజరువుతారన్నారు. మూడురోజులు పాటు జరిగే రైతు సమ్మేళనలో రైతాంగ సమస్యలపైచర్చించి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్.నరసింహులు, కార్యవర్గ సభ్యులు క్రిష్ణప్ప, సాంబశివ, మురళి, రంగారెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మతల్లికి ఘనంగా పూజలు

లక్కిరెడ్డిపల్లె, జులై 28, ప్రభాతవార్త:



మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం ఘనంగా భక్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లి వర్షాలు కురిపించాలని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి జాతరలో జనం పోటేత్తారు క్యూలైన్లు కిక్కిరిచాయి, జాతర ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. చిరువ్యాపారులు, బెల్లపుచెరుకులు, గంగమ్మజాతరలో ఆనవాయితి గంగమ్మ జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా చలువపందిళ్లు త్రాగు నీరు అన్ని ఏర్పాట్లు ఆలయ ప్రత్యేక అధికారి మారుతి ప్రసాద్ చేశారు.వచ్చిన భక్తులకు చేలు వంశీయులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మారుతి ప్రసాద్ యాదవ్ ఆలయ సిబ్బంది మధుసూదన్ రెడ్డి భక్తులు సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి చొరవతో సత్వరం తాగునీటి సమస్య పరిష్కారం

రామాపురం, జులై 28, ప్రభాతవార్త:



మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీలోని హరిజనవాడలో గత కొంత కాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్థులు ఇబ్బంది పడుతుండడంతో గ్రామస్థులు విషయాన్ని రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన మంత్రి ప్రత్యేక నిధులుతో ఆ గ్రామానికి ఆదివారం బోరు వేయించడం జరుగుతోందని మంత్రి సోదరుడు నియోజకవర్గ తెదేపా నాయకుడు డా. మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హరిజనవాడ తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు వద్ద కొబ్బరికాయ కొట్టి బోరును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడత నీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలకు మంత్రి చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా బోర్లు వేయించి నీటి ఎద్దడిని పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గానికి చెందిన మన ప్రియతమ నాయకుడు మా సోదరుడు మంత్రిగా ఉండడంతో నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి గ్రామాలను మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మద్దిరేవుల రమేష్‌రెడ్డి, గ్రామ నాయకులు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కష్టకాలాల్లో ఎదురొడ్డి నిలిచాం నామినేటెడ్ పదవికి చేరువలలో ఉన్నాం - చమర్తి

రాజంపేట, జులై 28, ప్రభాతవవార్త :
తెలుగేదేశం పార్టి అధికారంలో లేనప్పుడు అధికారంలో ఉన్న వైకాపా పార్టీ నాయకుల ఆగడాలు, దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచి ఎన్నో కష్ట నష్టాలను అనుభవించడమే కాకుండా రాజంపేట నియోజకవర్గంలోని తెలుగేదేశం కార్యకర్తలను కాపాడుకుంటూ నిలిచామని దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తందరలో పంచబోయో నామినేటెడ్ పదవికి తన పేరు ప్రతిపాధనలో ఉండి తాను చేరువలో ఉన్నానని రాజంపేట తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు తెలిపారు. ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నప్పటి నుండి పార్టీ అభివృద్ధి కోసం పార్ట్ టై రాజకీయాలు చేయకుండా అహర్నిశలు కృషి చేశామన్నారు. నియోజకవర్గంలోని పార్టీ టికెట్ ఆశించి ఏళ్ల తరబడి అన్ని గ్రామాలు తిరిగి అందరితో మమేకమై చివరి సమయంలో అధిష్టానం ఆదేశించిన మేరకు టిక్కెట్లను కూడా దారాళంగా వదులుకుని పార్టీ కోసం పని చేసిన వారికి ప్రత్యేక స్థానం కల్పిస్తామని చంద్రబాబు నాయుడు లోకేష్ బాబులు తెలిపారన్నారు. ఈ కోవలో కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాలకు సంబంధించి రాష్ట్ర నామినేటెడ్ పదవులకు తన పేరు ముందు వరుసలో ఉందని నామినేటెడ్ పదవులు బట్టి అవకాశం మెండుగా ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మానవత సంస్థ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

పీలేరు, జూలై 28 ప్రభాతవార్తః



2024-25 సంవత్సరానికి మానవత పీలేరు శాఖ నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. కార్యనిర్వాహకశాఖలో భాగంగా అధ్యక్షులుగా శెట్టి సుబ్రమణ్యం, కార్యదర్శిగా బొగ్గా రపు వెంకటసురేష్ కోశాధికారిగా ఎం.జగన్‌మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఛైర్మన్ రామచంద్ర ప్రకటించారు. అలాగే డైరెక్టర్స్ బోర్డు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఛైర్మన్ వి.రామచంద్ర, కో ఛైర్మన్ ఆర్.కష్ణమూర్తి, కన్వీనర్ యర్రంశెట్టి వెంకటరమణ, సభ్యులుగా ఎం.లక్ష్మీప్రసాద్‌నాయుడు. టి.రహత్‌బాషా, జీవి.రమణ, విజయకుమారి,నాగరాజ, ఆత్మకూరు రెడ్డెప్ప (డ్రైవింగ్ స్కూల్) ఎన్నికైయ్యారని తెలిపారు. అదేవిధంగా అడ్వయిజర్ కమిటీ సభ్యులుగా ఆర్. రాజగోపాల్‌రెడ్డి, బి.వెంకటరాజ, ఎస్. అక్రమ్‌బాష, రామమోహన్, రాయ ఆనంద, ప్యారూఖాన్, ఎస్. గఫార్‌బాషా, పోతంశెట్టి రమేష్, పెంజూరి అశోక్ ఎనిన్నకైయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా అధ్యక్షులుగా శెట్టి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి బి.వి.సురేష్, కోశాధికారి ఎం.జగన్‌మోహన్ ఉపాధ్యక్షులు ఎస్.జైపాల్‌రెడ్డిలుగా ఎన్నుకున్నారు.

## 40 మందికి కంటి పరీక్షలు

కేవి.పల్లె, జూలై 28 ప్రభాతవార్తః
మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలో గల వద్ధాశ్రమంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈవైద్యశిబిరంలో 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 11 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కంటి పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రసన్నకుమార్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలి

కడప వైద్యవిభాగం, జులై 28, ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలని, బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేయడం అన్యాయమని పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీపీ నాగేంద్ర, ఏఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్ నాయక్ అన్నారు. కడపనగంలో బాలుర బాయ్స్ హాస్టల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకుల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు వవీరికి గత 8 నెలలుగా మెస్ ఛార్జీలు అందలేదన్నారు. నిత్యావసర సరుకులు రోజు రోజు పెరుగుతున్నాయని నిర్వహణ బారంగా మారిందని వార్డెన్లు తమ దృష్టికి తెచ్చారన్నారు. విద్యార్థులకు యూనిఫాం, పెట్టెలు, గ్లాసులు, కాస్మొటిక్ ఛార్జిలు ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థులకు రావాల్సిన మెస్ ఛార్జీలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరుణ్, కృష్ణ, తేజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమాలయ ఆశ్రమం, ఆధరణ కేంద్రంలో అల్పాహారం పంపిణీ


కడప వైద్యవిభాగం, జులై 28, ప్రభాతవార్త:



కడప నగరంలోని జిల్లా పరిషత్ వద్ద ఉన్న ప్రేమాలయ ఆశ్రమంలో 40 మందికి, రిమ్స్ వద్ద గల ఆదరణ కేంద్రంలో 40 మందికి, పోతుల ట్రావెల్స్ పీవీఆర్ గ్రాండ్ ఇన్ హోటల్ వద్ద 300 మంది పేదలకు, అనాథలకు ఆదివారం ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరాంరెడ్డి, పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి, కంచమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి అమావాస్య, పౌర్ణమికి అన్నదానం ఉంటుందని పోతుల వెంకటరామిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఏఆర్ ఏఎస్పీ బి.కొండారెడ్డి, బాసట సంస్థధినేత బాలాజీ, డా.రంగనాథరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం

కడప వైద్యవిభాగం, జులై 28, ప్రభాతవార్త:



తమ పెన్షనర్ల సమస్యలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించడం జరిగిందని ఆంధ్ర పెన్షనర్ల పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునయ్య, అధ్యక్షుడు సుబ్బరాయన్, ప్రధాన కార్యదర్శి పెద్దన్నగౌడ్‌లు అన్నారు. నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. గత 25వ తేదీ తమ పెన్సనర్ల సమస్యలపై సీఎం చాంబర్‌లో కలిసి వివరించామని చెప్పారు. అందుకు సానుకూలంగా స్పందించారని చెప్పారు. పెన్షనర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు స్పందించారని 1వ తేదీన జీతాలు ఇచ్చినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. అంతే కాకుండా తమకు సీఎంను కలవడానికి అనుమతి ఇప్పించిన విజయవాడకు చెందిన టి.జి.జనార్ధన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో భావోద్వేగాల అదుపుపై ఆధ్యాత్మిక సదస్సు





రాయచోటి, జులై 28, ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కడప నగరానికి చెందిన చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ట్రాన్స్ ఫార్మ్ ఇండియన్ టు ట్రాన్స్‌ఫార్మ్ ఇండియా అంశంపై మూడు రోజుల ఆధ్యాత్మిక అవగాహన సదస్సును నిర్వహించారు. 3వ రోజు ఆదివారం చిన్మయ మిషన్ ప్రెసిడెంట్ శ్రీ తురియానంద సరస్వతి మానసిక ప్రశాంతత మరియు భావోద్వేగాల అదుపుపై విద్యార్థినీ విద్యార్థులకు సూక్ష్మ రీతిలో వివరించారు. ప్రతి విద్యార్థి కోపం, బాధ, ఆనందం, ప్రేమ, జాలి దయ వంటి భావోద్వేగాలకు లోనవుతారని కానీ వీటిని పరిసరాలకు, సమయ సందర్భాలకు అనుగుణంగా మలుచుకొని మంచి నడవడికతో అడుగులు వేయాలని సూచించారు. ప్రతి మనిషి ఎదుర్కొనే కోపం శత్రువు అని దీనిని జయించడానికి వివిధ మార్గాలను సూచిస్తూ కోపసం రాగానే అప్పుడు నేను అనవసరంగా కోప్పడ్డాను ఇది నాకు మంచిది కాదని అంగీకరించడం, ఆగ్రహం తెప్పించిన విషయాన్ని మళ్లించడం, కళ్లను మూసుకొని దీర్ఘ శ్వాస చేయడం, జీవితంలో మీరేం చేస్తున్నారో మనోదృశ్య చిత్రణ చేసుకోవడం, తీరిక తీసుకొని బొమ్మలు వేయడం, ఆడటం, సంగీతం వినడం వంటి సృజనాత్మక పనులు చేయడం మంచి ఆహారం తీసుకొని వ్యాయామం చేయడం ద్వారా మానసిక శారీరక ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో హాజరైన విద్యార్థులందరికీ శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## అధికారులతో సమావేశమైన కలెక్టర్

జమ్మలమడుగు, జులై 28, ప్రభాతవార్త:



జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోని సభాభవనంలో జమ్మలమడుగు ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జమ్మలమడుగుకు సంబంధించిన ఆయా శాఖలలో ఎ లాంటి సమస్యలు ఉన్నాయి, ఆ సమస్యల నివేదికను రాతపూర్వకంగా పంపాలని పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు సంబంధిత అధికారులు తమ వసతి గృహాలకు సంబంధించిన నీఠ సమస్య, వసతి గృహాలకు దోమలు రాకుండా మెష్‌లు, ప్రహరీగోడ, ఇంటర్నల్ మరియు అప్రోచ్ రోడ్లు ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు కలెక్టరును కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రం ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మలమడుగు, జులై 28, ప్రభాతవార్త:

పెద్దముడియం మండలం చదిపిరాళ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామానికి చెందిన ఉలవల చెంచిరెడ్డి ఆక్రమించుకున్నారని గ్రామస్థులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రం లేక రేకుల షెడ్డులో విద్యార్థులు చదువుకోవడంతో పాములు, విష పురుగుల భయంతో నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆక్రమించుకున్న భవనాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి తిరిగి ఇచ్చి విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

## అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో పుస్తకావిష్కరణ

రాజంపేట అర్బన్, జూలై 28, ప్రభాతవార్త:



ప్రపంచం ఇక కృత్రిమ మేధతో ముడిపడదీనుందని అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో కృత్రిమ మేధ పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఛాన్స్‌లర్ డాక్టర్ సి.గంగిరెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎం.వి నారాయణ పాల్గొన్నారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ ఎం.సుబ్బారావు(ప్రొఫెసర్ మరియు హెడ్, సీఎస్ఇ విభాగం), డాక్టర్ పి.ఫణీంద్ర కుమార్‌రెడ్డి(అసోసియేట్ ప్రొఫెసర్ మరియు హెడ్,ఏఈ అండ్ డిఎస్ విభాగం), డాక్టర్ డి.సారిక(అసిస్టెంట్ ప్రొఫెసర్, సిఎస్ఇ), మిసెస్ కె.కార్పాగ వల్లి(అసిస్టెంట్ ప్రొఫెసర్, సిఎస్ఇ) సంయుక్తంగా రచించారు. ఈ కార్యక్రమంలో పలువురు విధ్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. కృత్రియ మేధస్సు యొక్క బేసిక్ సూత్రాలను, వాటి అన్వయాలను వివరించడంలో చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ పుస్తకంలో కృత్రిమ మేధస్సు రంగంలో ప్రాధమిక సూత్రాలను, సిద్ధాంతాలను అనువర్తనాలను స్పష్టంగా వివరించారు. కృత్రిమ మేధస్సులోని ముఖ్యమైన పద్ధతులు, వాటి ఉపయోగాలు, ఉపయుక్తతలను వివిధ ఉదాహరణలతో సహా వివరించారు. ప్రత్యేకంగా యంత్ర అభ్యాసం, ప్రాక్టికల్ ప్రాజెక్టులు, సొల్యూషన్స్ అడాప్షన్, డేటా ప్రాసెసింగ్ గురించి పుస్తకం ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ పుస్తకం విధ్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు ఐటి రంగంలో పనిచేసే వారికి ఎంతో ఉపయోగకరరంగా ఉంటుంది. కృత్రిమ మేధస్సులో ఉన్న నూతన అవకాశాలను మరియు సవాళ్లను అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం ఒక మంచి మార్గదర్శిగా ఉంటుందని రచయితలు పేర్కొన్నారు. పుస్తకం అర్థం చేసుకోవడానికి సులభంగా ఉండే విధంగా వివరంగా రాసిన ఈ పుస్తకం, కృత్రిమ మేధస్సు రంగంలో ఉన్న విభిన్న అంశాలపై పూర్తిగా అవగాహణ కల్పిస్తుంది.

## ప్రపంచ కాలేయ దినోత్సవం సంధర్భంగా అవగాహణ

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 28, ప్రభాతవార్త



కాలేయ దినోత్సవం సంధర్భంగా టిబి రోడ్ ప్రభుత్వ బాలికల హాస్టల్ నందు సోమవారం అవగాహణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైద్యాధికారి దినేష్ మాట్లాడుతూ ప్రస్తుతం కాలేయ వ్యాధి ప్రపంచంలో అధికంగా ప్రభలుతుందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ వైరస్ వల్ల వచ్చే కాలేయ వ్యాధులను నిర్మూలించాలని ప్రణాళిక చేస్తుందని, ఈ వ్యాధి శుభ్రం లేని శిరంజెస్, నీడిల్స్, మరియు బ్లేడ్స్ ద్వారా శుభ్రంగా లేని రక్తంను ఎక్కించడం వలన, విచ్చలవిడి శృంగారం ద్వారా వ్యాపిస్తుందని ఈ వ్యాధి నివారణ టెస్ట్‌ల ద్వారా వైరల్ హెపటైటిస్‌ను గుర్తించి తద్వారా తగిన చికిత్స తీసుకోవాలని, అలాగే హెపటైటిస్ బి టీకాలు వేయించుకోవాలని, ముఖ్యంగా గర్భవతులందరు తప్పకుండా నిర్ధారణ టెస్ట్‌లు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఓ సుబ్బారెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యవతి, ఫార్మాసిస్ట్ దినేష్ మరియు ఆశలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీయల్లమ్మ తల్లికి బోణాలు

పీలేరు, జూలై 28 ప్రభాతవార్తః



పట్టణంలోని చిత్తూరు మార్గంలో గల మోడల్‌కాలనీ నందు నూతనంగా వెలసిన శ్రీయల్లమ్మ తల్లికి అధిక సంఖ్యలో బోణాలు సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త దేవిరెడ్డి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసదీక్షితులు పూజారి శ్రీరాములు ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి తోమాల, పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈసందర్భంగా కాలనీవాసులతో పాటు ప్రశాంత్‌నగర్, పీలేరు పట్టణవాసులు యల్లమ్మ తల్లికి బోణాలు సమర్పించారు. జాతీయరహదారి పక్కన ఆహ్లాదకర వాతావరణంలో గుడి ఉండటంతో చుట్టుపక్కల ప్రజలతోపాటు దారిన వెళ్లేవారు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## హెపటైటిస్ ఒక ప్రాణాంతక అంటువ్యాధి

పీలేరు,జూలై 28 ప్రభాతవార్తః



హెపటైటిస్ చాలా ప్రమాదకరమైన కాలేయ సంబంధిత వైరల్ అంటువ్యాధి అని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. ఆదివారం ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా కోటపల్లె బీసీ బాలుర వసతిగహ విద్యార్థులకు హెపటైటిస్ వ్యాధి జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివరిస్తూ నాలుగు రకాలుగా చెప్పుకునే హెపటైటిస్ శుభ్రతలేని ఆహారం, నీటివల్ల, కలుషితమైన రక్తం ద్వారా ఇతరులకు సోకి వీటిలో కొన్ని మందులతో నివారించబడతాయన్నారు. వ్యాధిగ్రస్తుని శరీరంలో రక్తం, స్రావాలు, మూత్రము, వీర్యము ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. కావున నిర్మూలన దిశగా ఉచిత రక్తపరీక్షలు ద్వారా నిర్ధారించుకుని చికిత్స పొంది 2030నాటికి హెపటైటిస్ వ్యాధి రహిత సమాజానికి అందరూ సహకరించాలని డాక్టర్ కోరారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, వార్డెన్ మునుస్వామినాయక్, భార్గవి, చంద్రకళ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ ఎల్లమ్మ దేవత అమ్మవారికి సిల్లుబోనాలు



కలికిరి, జులై 28, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో గ్రామ దేవతగా వెలసిన శ్రీ ఎల్లమ్మ అమ్మవారికి ఆదివారం జాతర సందర్భంగా భక్తులు సిల్లు బోనాలతో మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా కలికిరి పంచాయతీలో పలు గ్రామాల నుంచి కాకుండా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల నుంచి సైతం అలాగే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కలికిరి ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు చెల్లించారు. జాతర సందర్భంగా ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు రెడ్డి వారి యోగేష్‌రెడ్డిలు అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. దీంతో అధిక సంఖ్యలో మహిళా భక్తులు ఆలయానికి చేరుకోవడంతో భక్తులతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్తలు అన్ని సదుపాయాలు కల్పించారు. కలికిరి సీఐ మోహన్ తమ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు-సీఐ

ముద్దనూరు, జూలై 28, ప్రభాతవార్త:




ముద్దనూరు పాత బస్టాండ్, పూలంగళ్ల సర్కిల్ వద్ద ఆదివారం నాడు కడప జిల్లా ఎస్పి హర్ష్యవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సిఐ దస్తగిరి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని బోర్డును ఏర్పాటుచేసి ప్రజలతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించడం చట్ట వ్యతిరేకమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం తాగి వాహణాలు నడిపి ప్రమాదాలకు గురౌతున్నారని, మద్యం తాగి వాహనాలు నడపరాదని అన్నారు. అదేవిధంగా మద్యం మరియు గంజాయికి బానిసలై తమ కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని వాటి జోలికి వెల్లకుండా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మరియు పోలీసులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భారత వేదం నృత్యం

కడప కార్పొరేషన్, జులై 28, ప్రభాతవార్త:

సాయం సంధ్య వేళల్లో పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో కడప శిల్పారామంలో భారత వేదం నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం కడప శిల్ప రామంలోని శిల్ప కళా వేదికపై విజయశాంతి ఆధ్వర్యంలో కడప నగరానికి చెందిన ముద్ర డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల సినీ నృత్యాలతో కడప వాసులను అలరించారు. శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.



## ముత్యాలమ్మ జాతరలో ఎమ్మెల్యే దంపతులు

పీలేరు, జూలై 28 ప్రభాతవార్తః



మండలంలోని రాతిగుంటపల్లె పంచాయతీలో ఆదివారం నిర్వహించిన ముత్యాలమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈజాతరకు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆయన ధర్మపత్ని నల్లారి తనూజారెడ్డిలు హాజరవడంతో స్థానిక సర్పంచి కోనేని అలివేలమ్మ, తెదేపా కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం అమ్మవారి సేవలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంతో తెదేపా నాయకులు కోనేని ఆనంద వసంత, మల్లికార్జునవాయుడు, దగ్గుపాటి వెంకటేశ్వరరావు, పెద్దోడు, అలియాస్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అధ్యాత్మిక ప్రవచనాలు

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 28, ప్రభాతవార్త:



స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం బ్రహ్మ శ్రీ మల్లాది వెంకట రామనాధశర్మ, శివపురాణం, రామాయణం, భాగవత పురాణాల్లోని శివకళ్యాణం, సీతాకళ్యాణం, రుక్మిణి కళ్యాణంల గురించి అధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులు మనకు ఆదర్శమన్నారు. దంపతుల మధ్య మోహం కాకుండా ప్రేమాభిమానాలు, అన్యోన్యత ముఖ్యమని, ఇవి లేకనే నేటి సమాజంలో వివాహ వ్యవస్థ దెబ్బతింటోందన్నారు. సీతారాములు మనకు కుటుంబ ధర్మానికి ఆదర్శంగా నిలుస్తారని, ధర్మాచరణలో భార్యభర్తలు కలిసి అడుగు వేయాలని తెలిపారు. శ్రీ కృష్ణుడు సాక్ష్యాత్తు జగద్గురు అయినప్పటికి గృహస్థధర్మానికి ప్రాధాన్యత ఇచ్చి రుక్మిణి దేవిని వివాహం చేసుకున్నాడన్నారు. భార్యభర్తల దాంపత్యం గురించి వివాహ వ్యవస్థ ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహణ రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ఉన్న పార్కును

## ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, జులై 28, ప్రభాతవార్త:



లక్కిరెడ్డిపల్లె గ్రామ పరిధిలోని తాసిల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గ్రామ ఉద్యానవన పార్క్ ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధిగాళ్ళ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నిరుపయోగంగా ఉన్న పార్కును పరిశీలించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ నాటి టిడిపి ప్రభత్వం 2018 ప్రస్తుత విద్యాశాఖ మరియు ఐటి మంత్రి నారా లోకేష్ ప్రారంభించిన ఈ పార్క్ కొన్ని నెలల పాటు గ్రామ ప్రజల మానసిక ప్రశాంతత కోసం పార్కుకు వచ్చి గడిపేవారు తదునంతరం వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రావడం వల్ల పార్కును పూర్తిగా నిర్లక్ష్యం చేసి పిచ్చి మొక్కలు వేకుగా పెరిగిపోయాయి మందు బాబులకు అడ్డగా మారడంతో అటువైపు మహిళలు చిన్నపిల్లలు వెళ్లి కాసేపు ఆడుకోవాలని వాక్ చేయాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కావున నిరుపయోగంగా ఉన్న ఈ పార్కును అధికారులు చొరవ చేసి గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అబ్బాస్, రామంజనేయులు, వీరాంజనేయులు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అపూర్వం

రాయచోటి, జులై 28, ప్రభాతవార్త:

రాయచోటి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సంస్థ ఆపదలో ఉన్న ప్రజలకు నిరుపేదలకు చేస్తున్న నసేవలు అపూర్వమని రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డా.లక్ష్మీప్రసాద్‌రెడ్డిలు కొనియాడారు. లయన్స్ క్లబ్ సభ్యులు దాతల నుంచి విరాళాలు స్వీకరించి ప్రజలకు సహాయపడడం అభినందనీయమన్నారు. సభ్యులు ఎవరూ ప్రతిఫలం ఆశించకుండా తోటి మానవులకు సహాయపడాలనే లక్ష్యంతో ఈ సంస్థలో పనిచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. సమావేశంలో డాక్టర్లు భయ్యారెడ్డి సంగమ్మలు మాట్లాడుతూ మనం సంపాదించిన సంపదలో పేద వారికి సహాయం కొంత భాగం చేయాలని అప్పుడే మానవ జన్మకు సార్థకత లభిస్తుందన్నారు. సమావేశంలో ఎంజేఎఫ్ లయన్ జేఆర్ చంద్ర ప్రకాష్‌రావు సుధాకర్‌రెడ్డి, చిన్నపరెడ్డి, రమేష్‌నాథ్‌రెడ్డి, డా.కీర్తిరెడ్డి, విజయ్‌కుమారి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మట్లి సర్పంచ్ నాగార్జున ఆచారి, జోన్ చైర్మన్ మహ్మద్ సభ్యులు ప్రసంగించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడుగా పి.శివారెడ్డి, కార్యదర్శి ఇమ్దాద్ అహ్మద్, కోశాధికారిగా జి.కిశోర్‌కుమార్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శివారెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ కార్యక్రమాల పట్ల అంకిత భావంతో పనిచేస్తానని కుల మతాలకతీతంగా పేద వారికి సహాయం చేయడానికి లయన్స్ క్లబ్ ద్వారా అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.




## మానవత సేవలు అభినందనీయం



వేంపల్లె, జులై 28, ప్రభాతవార్త ః

మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవలు అభినందనీయమని వేంపల్లె ప్రభుత్వ పశువైద్యులు సాజిద్‌బాషా అన్నారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన మాసాంతర సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలోని పేదలు, నిస్సహాయులకు మానవత సంస్థ అండగా నిలవడం హర్షణీయమని అన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం మానవత శాఖ ఛైర్మన్ బి.చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వివిధ రకాల విద్య, వైద్యపరమైన సేవలతో పాటు మూగజీవాల రక్షణ, మొక్కల పెంపకం, అనాథల పట్ల శ్రద్ధ చూపడం లాంటివి సేవలు అందించేఉదకు మానవత కృషి చేస్తోందన్నారు. రానున్న శ్రావణమాసంలో గండి దేవస్థానానికి కాలినడకన వెళ్లే భక్తుల కోసం అన్నదనాం, తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సహాయ ఛైర్మన్ కావలి క్రిష్ణతేజ, కన్వీనరు రంగారెడ్డి, అధ్యక్షుడు శ్రావణ్, రీజనల్ ఛైర్మన్ బాలాజి, డైరెక్టర్లు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, బొజ్జ అనీల్‌రెడ్డి, కోశాధికారి శ్రీకళ, సభ్యులు గోవర్ధన్, గంగయ్య, గోపి, వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

దువ్వూరు, జూలై 28, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కడప-కర్నూల్ జాతీయ రహదారిపై ఐ.బయనపల్లె మెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్మిశెట్టి శారద(54) అనే మహిళ మృతిచెందింది,. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఐ.బయనపల్లె గ్రామానికి చెందిన శారద ఆదివారం తెల్లవారుజామున జాతీయ రహదారి అయిన మెట్ట వద్ద నిలబడి ఉండగా గుర్తు తెలియని వాహణం ఢీ కొంది. దీంతో శారద అక్కడిక్కడే మృతి చెందింది. స్థానికులు ఈ విశయాన్ని గమనించి బంధువులకు తెలియజేశారు. ఈ మేరకు మృతదేహాన్ని పొస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

## 800మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 28, ప్రభాతవార్త

శ్రీ చౌడేశ్వరి దేవి తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపం మరియు వరల్డ్ హెల్త్ డెవలప్‌మెంట్ అండ్ హ్యూమన్‌రైట్స్ ఫోరమ్ కర్ణాటక వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రామేశ్వరం రోడ్డులోని శ్రీ చౌడేశ్వరి దేవి తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో డాక్టర్ సాదిక్ బాష ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రెండు రోజుల మెగా వైద్య శిబిరం ఆదివారంతో ముగిసింది. ప్రజల నుండి ఈ మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. హీలర్స్ సాదిక్ బాషతో పాటు నసీరుద్దీన్, అష్య, ముసద్దిక్ పాషా, సుబాన్, సుబ్రమణ్యం, ఆచారి, కరీమూన్ తదితరులు రెండు రోజుల పాటు దాదాపు 800మందికిపైగా చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య బృందానికి కళ్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్యకు స్నేహ సేవాసమితి అధ్యక్షుడు మధుసూధన్ రెడ్డి, ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు బైసాని సత్య నారాయణ, మన ప్రజాసేవాసమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు జింకా సుబ్రమణ్యం, గజ్జల వెంకటేశ్వర రెడ్డి, మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ అధ్యక్షుడు మోరె లక్ష్మణ్‌రావు, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

